

పిఠాపురంలోని కుమ్మరివీధి సచివాలయంలో ఓటుహక్కు వినియోగించుకున్న కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్

ఓటరుకు ఏమైంది.. ఏనాడు లేదు.. ఎన్నడూ చూడలేదు.. ఓటు చైతన్యం వచ్చేసింది.. వైసీపీ ప్రభుత్వంపై కోపమో.. కూటమి మేనిఫెస్టో ఫలితమో కానీ.. ఓటరు పోటెత్తాడు.. ఓటెత్తాడు.. ఎండను సైతం లెక్కసేయక నేను సైతం అంటూ ముందడుగు వేశాడు.. ప్రతి ఓటు విలువైనదే అంటూ చాటిచెప్పాడు.. వరద గోదారిలా ఈవీఎంలను యంత్రాలను ముంచెత్తాడు.. జిల్లాలో ఉదయం 7 గంటలకు ఆరంభమైన పోలింగ్ రాత్రి 12 గంటలైనా ముగియలేదు.. అక్కడక్కడా కొనసాగుతూనే ఉంది.. అన్ని వర్గాలు ఓటెత్తడంతో క్యూలైన్లు తరగడం లేదు..చాలా నియోజకవర్గాల్లో 75 శాతం దాటి ఓటింగ్ నమోదైంది. ఏమైతేనేం ప్రజలు తీర్పు ఇచ్చేశారు.. మరో ఐదేళ్ల పాలనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. దీంతో ప్రజల పనైపోయింది.. ఈవీఎం యంత్రాల్లో అది నిక్షిప్తమై ఉంది.. ఆ తీర్పు బయటకు వెలువడాలంటే జూన్ 4వ తేదీ వరకూ వేచిచూడాల్సిందే మరి.. అప్పటి వరకూ అభ్యర్థులకు టెన్షనే మరి..!?



పిఠాపురంలో పోటెత్తిన ఓటర్లు



కాకినాడలో ఓటుహక్కు వినియోగించుకున్న కలెక్టర్ నివాస్

ఓటెత్తారు!

కదిలిన పట్టణాలు.. పల్లెలు

- జిల్లాలో ఓటేయడానికి తరలివచ్చిన జనం
- కొన్నిచోట్ల రాత్రి 12 గంటల వరకు
- జిల్లాలో 74.24 పోలింగ్ శాతం



కోటనందూరు మండలంలో ఎండలో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు



కోటనందూరు మండలం పాతకొట్టాంలో కరెంటు కోతతో ఓటర్లు ఇక్కట్లు



ప్రత్తిపాడు మండలం ధర్మవరం మెయిన్ పాఠశాల వద్ద బారులు తీరిన ఓటర్లు



పిఠాపురంలోని పోలింగ్‌బూత్‌ల వద్ద ఆందోళన చేస్తున్న ఓటర్లు



తునిలో అర్ధరాత్రి 12గంటలకు కూడా ఓటు వేస్తున్న ఓటర్లు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్, మే 13: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఓటెత్తారు. కనివినీ ఎరుగని రీతిలో లక్షల్లో పోటెత్తారు. పోలింగ్ బూత్‌లకు వెల్లువల కదిలారు. మహిళలు, వృద్ధులు, యువత భారీగా క్యూ కట్టారు. ఉదయం 7గంటల నుంచే జిల్లాలో ఏ బూత్ వద్ద చూసినా క్యూలైన్ల రద్దీతో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరారు. పెరిగిన ఓటింగ్‌శాతంతో అధికార వైసీపీ వణికిపోయింది. వెల్లువలా తరలివచ్చిన ఓటర్లు పార్టీ పుట్టి ముంచేశారనే లెక్కలతో కుదేలయ్యారు. పోలింగ్ సరళి చూసి మధ్యాహ్నం నుంచి ఏకంగా బూత్‌లను వదిలేసి వెళ్లిపోయారు. కాగా సాయంత్రం ఆరుతో పోలింగ్ ముగియాల్సి ఉన్నా అప్పటికే వందలాది బూత్‌లవద్ద ఓటర్లు ఉండడంతో వారందరికీ టోకెన్లు ఇచ్చారు. దీంతో ఎప్పుడూలేని విధంగా రాత్రి 10గంటల వరకు జిల్లాలో పోలింగ్ కొనసాగింది. విద్యుత్ లేకపోవడం, అంధకారం, ఈవీఎంల మొరాయింపు, సర్వర్లు పనిచేయకపోవడం వంటి అనేక కారణాలతో ఓటర్లకు ఎన్నికల అధికారుల పరీక్ష పెట్టారు.

ఓటర్ల బారులు.. చిక్కులతో తలనొప్పులు

జిల్లాలో ఉదయం ఏడు గంటల నుంచే ఏడు నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రారంభమైంది. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పిఠాపురం, పెద్దాపురం, తుని, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలు బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో పోలింగ్ అనేక చోట్ల మందకొడిగా సాగింది. ఎండ బారిన పడకుండా ఉదయాన్నే ఓటుహక్కు వినియోగించుకోవాలని వచ్చిన ఓటర్లకు అధికారులు పరీక్ష పెట్టారు. ఈవీఎంలు పనిచేయకపోవడం, ఎండ, మంచినీటి వసతి లేకపోవడంతో ఓటర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం అన్నవరంలో అరగంట ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. మాక్ పోలింగ్ ఓట్లు క్లియర్ చేయకపోవడంతో ఆలస్యం అవడంతో సమస్య తలెత్తింది. రౌతులపూడిలో ఈవీఎంలు మొరాయించడంతో గంటపాటు జనం క్యూలైన్లలో నిల్చున్నారు. సామర్లకోటలో ఉదయం పి.వేమవరం, కొత్తూరు, పెద్దాపురం మండలం రాయభూపాలపట్నంలో, రౌతులపూడి ఎస్.అగ్రహారం, కిర్లంపూడి వెలుగు కార్యాలయం బూత్, కరప మండలం వేలంగి, అరట్లకట్ల 201 బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు. వీటన్నింట్లో గంటకుపైగా పోలింగ్ నిలిచిపోయింది. పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులోని ఏకే మల్లవరం 42వ బూత్, గొల్లప్రోలులో 61వ బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. తాళ్లరేవు మండలం పట్టిగొందిలో 268బూత్, తుని, కాకినాడ సిటీ, పెద్దాపురం, పిఠాపురంలో పలుచోట్ల పోలింగ్ కేంద్రాల్లో వసతులు లేకపోవడంతో జనం ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల అధికారులతో గొడవ పెట్టుకున్నారు. కాకినాడ రూరల్‌లోని గంగనాపల్లిలో మహిళా ఓటర్లు భారీగా రావడంతో పింక్‌బూత్ దగ్గర మహిళలు పడిగాపులు కాశారు. తాళ్లరేవు మండల పరిషత్ పాఠశాలలోని 223 బూత్‌లో సాయంత్రం గంటపాటు ఈవీఎంలు పనిచేయ లేదు. యు.కొత్తపల్లి మండలం ఎండపల్లిలో ఈవీఎంలు మొరాయించడంతో చాలా సేపు పోలింగ్ ఆగిపోయింది. గొల్లప్రోలు మండలం వన్నెపూడి 20వ నెంబర్ బూత్‌లో 150ఓట్లు పడ్డ తర్వాత ఈవీఎం మొరాయించించడంతో జనం ఇబ్బందులు పడ్డారు. గొల్లప్రోలు మండలం కొడవలిలో డబ్బులు ఇస్తామని ఓటర్లను వైసీపీ తీసుకువచ్చింది. తీరా డబ్బులు ఇవ్వకపోవడంతో ఓటువేయకుండానే పలువురు వెళ్లిపోయారు. తమ ఓట్లు తొలగించారంటూ పిఠాపురం మండలం విరవాడలో యువ ఓటర్లు అధికారులను నిలదీశారు. వైసీపీ ఓట్లు జాబితాలో ఉంచి తమ ఓట్లు తీసేశారని ఆందోళన చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో అనేకచోట్ల ఓటు వేసేటప్పుడు ఈవీఎంపై ఉన్న బ్యాలెట్ పేపర్ కనిపించడం లేదని, చీకట్లో పోలింగ్ నిర్వహించడంపై స్థానిక యువత ఉదయం ప్లకార్డులతో ఆందోళనకు దిగింది. చీకట్లో ఈవీఎంలు అంటూ ప్లకార్డులతో వీరంతా ఆందోళన చేశారు.

జిల్లా కలెక్టర్ సతీసమేతంగా కాకినాడ శ్రీనగర్‌లోని 23వ బూత్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ప్రత్తిపాడులో బ్యాలెట్ పేపర్‌లో జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ముఖం కనిపించకుండా అడ్డంగా సిరాతో ఏదో గుర్తు ఉండడంతో ఆయన ముఖం ఓటర్లకు కనబడలేదు. మండలంలో 14 గ్రామాల్లో ఇలాగే ఉందంటూ టీడీపీ నేతలు ఆర్వోకు ఫిర్యాదు చేశారు. గండేపల్లిలో నీలాద్రిరావుపేటలో రాజీనామా లేఖ చూపకుండా ఎలక్షన్ ఏజెంట్లుగా ఉన్న వలంటీర్లను టీడీపీ నాయకులు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. రాజీనామా చేసిన వలంటీర్లు ఎన్నికల ఏజెంట్లుగా అనేక నియోజకవర్గాల్లో పనిచేశారు.

రాత్రయినా నిలబడితే అలా చేశారేంటో..

సాయంత్రం ఆరు తర్వాత కూడా జిల్లాలో 350కి పైగా బూత్‌ల్లో ఓటర్లు ఉండిపోయారు. దీంతో వీరందరికీ అధికారులు టోకెన్లు పంపిణీ చేశారు. రాత్రి దాటినా టోకెన్లు పూర్తయ్యే వరకు పోలింగ్ కొనసాగించాలని నిర్ణయించారు. కానీ అనేక పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ వసతి లేకపోవడంతో ఓటర్లు చాలా ఇబ్బంది పడ్డారు. విద్యుత్ సదుపాయం ఉన్న చోట సరఫరా లేకపోవడంతో అంధకారంలో ఓటర్లు గంటల తరబడి నిల్చున్నారు. తుని రూరల్‌లో తాళ్లూరులో 77వ బూత్‌వద్ద, దొండవాక, డి.పోలవరం బూత్‌ల్లో గాలివానతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పోలింగ్ చాలా సేపు ఆగిపోయింది. కాకినాడ రూరల్‌లో రాత్రి సర్వర్ మొరాయింపుతో జనం ఇబ్బంది పడ్డారు. కోటనందూరు మండలం పాతకొట్టంలో గంటపాటు విద్యుత్ నిలిచిపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తుని మండలం తాళ్లూరులో విద్యుత్ లేక పోలింగ్ నిలిచిపోయింది. 400మంది వరకు ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఓ మహిళ సొమ్మసిల్లి పోయింది. తాళ్లరేవు మండలం కోరంగా పంచాయతీ లోని సీతారాంపురం బూత్‌లో స్పృహ తప్పి ఓ ఓటర్ పడిపోయాడు. పెద్దాపురం నియోజకవర్గంలో 210 పోలింగ్ కేంద్రాలకు గాను పోలింగ్ ముగిసిన తర్వాత 62 బూత్‌ల్లో రాత్రి 7.15 గంటలకు వందల్లో ఓటర్లు బారులు తీరారు.

80శాతం దాటిపోయింది..

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జిల్లాలో భారీ ఓటింగ్ శాతం నమోదయ్యేలా చేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఓటర్లు పోటెత్తడంతో పోలింగ్ 80శాతం దాటిపోయింది. వాస్తవానికి సోమవారం సాయంత్రం ఆరు దాటక పోలింగ్ ముగియాలి. ఏడు గంటలకు మొత్తం ఓటింగ్‌శాతం లెక్కలు తేలాలి. కానీ భారీగా ఓటర్లు పోటెత్తడంతో అర్ధరాత్రి 12 గంటలకు అతికష్టంపై అధికారులు పోలింగ్‌శాతం లెక్కగట్టారు. అందులోభాగంగా జిల్లాలో ఏడు నియోజకవర్గాల సరాసరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ 80శాతం నమోదైంది. మొత్తం ఓటర్లు జిల్లాలో 16,34,122 వరకు ఉండగా, 13,07,289 వరకు ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తం పురుష ఓటర్లు 8,04,465 ఉండగా, 6,44,213మంది అంటే 72శాతం వరకు ఓటుహక్కు వినియోగించుకున్నారు. మహిళల ఓట్లు జిల్లాలో 8,29,471 ఉండగా ఇందులో మహిళలు 6,75,674మంది ఓట్లు వేశారు. దీంతో వీరి పోలింగ్ శాతం 74.24గా నమోదైంది.

నియోజకవర్గాలవారీగా..

పిఠాపురం నియోజకవర్గంలో 78.61శాతం పోలింగ్ నమోదైంది. పెద్దాపురం నియోజకవర్గంలో 78.13 శాతం పోలింగ్ నమోదైంది. తుని నియోజకవర్గంలో అత్యధికంగా 83.20శాతం పోలింగ్ నమోదైంది. జగ్గంపేటలో 76.22శాతం పోలింగ్ నమోదైంది. కాకినాడ రూరల్‌లో 73.02శాతం పోలింగ్ నమోదైంది. కాకినాడ సిటీలో 71.22శాతం పోలింగ్ నమోదైంది.



ఇరువర్గాలను వారిస్తున్న ద్వారంపూడి

దాడులు.. దౌర్జన్యాలు..

- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతో జిల్లాలో వైసీపీ దాడులు, బెదిరింపులు, దౌర్జన్యాలు
- నియోజకవర్గాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు అడుగడుగునా ఆగడాలే
- కాకినాడ సిటీలో రెచ్చిపోయిన ద్వారంపూడి అనుచరులు: తిరగబడ్డ టీడీపీ నేతలు
- కారు ఎక్కి పరారైన ద్వారంపూడి
- పిఠాపురం విరవాడ, జగ్గంపేటలో రెచ్చిపోయిన వైసీపీ శ్రేణులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం జిల్లాలో వైసీపీ ఓటమి భయంతో దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులకు దిగింది. నియోజకవర్గాల్లో అనేక బూత్‌ల్లో రెచ్చిపోయింది. ఓటర్లు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారన్న భయంతో నేరుగా క్యూలైన్ల వద్ద డబ్బులు పంచడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేపట్టింది. కొన్ని చోట్ల స్లిప్పుల్లో డబ్బులుపెట్టి పంచింది. దీన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలపై వైసీపీ మూకలు దాడులకు దిగాయి. కర్రలు, కుర్చీలతో దాడి చేశాయి. దీనికి ప్రతిగా టీడీపీ, జనసేనలు పలుచోట్ల దీటుగా జవాబు ఇవ్వడంతో తోకముడిచాయి. ప్రధానంగా కాకినాడ సిటీలో ద్వారంపూడి సమక్షంలో ఆయన అనుచరులు రెచ్చిపోయారు. మాజీ ఎమ్మెల్యే కొండబాబు సోదరుడి కుమారుడిపై దౌర్జన్యం చేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో రామకృష్ణారావుపేట మున్సిపల్ స్కూల్లోని పోలింగ్ కేంద్ర వద్దకు వచ్చిన డివిజన్ టీడీపీ పరిశీలకుడిపై వైసీపీ మూకలు దాడితో వివాదం తలెత్తింది. విషయం తెలియడంతో జగన్నాథపురంనుంచి టీడీపీ నేతలు వచ్చి వైసీపీ మూకలను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఇంతలో అక్కడకు వచ్చిన ద్వారంపూడినీ అడ్డుకున్నారు. దీంతో ఆయన తోకముడిచి కారులో పారిపోయారు. పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాలవద్ద బూత్‌లో ఉద్రిక్తత నెలకొంది. జనసేన ఏజెంట్లు వేసుకున్న కండువాలు తీసేయాలని వైసీపీ ఏజెంట్లు గొడవకు దిగారు. అలా అయితే పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్లు తీసేయాలని జనసేన ఏజెంట్లు గొడవకు దిగారు. పోలీసులు వచ్చి ఇరువర్గాలను శాంతింపచేశారు. కాకినాడ సిటీలోని సినిమారోడ్డులో సీబీఎం స్కూల్ వద్ద టీడీపీ, వైసీపీ ఘర్షణ పడ్డాయి. జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం కృష్ణవరంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బూత్‌ల వద్ద స్లిప్‌లు ఇస్తూ వైసీపీకి ఓటు వేయండి అంటూ ఆపార్టీ నేతలు ప్రచారం చేశారు. దీంతో టీడీపీ కార్యకర్తలు నిలదీశారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ పెద్దదై కుర్చీలు, కర్రలతో దాడి చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. కాజులూరు మండలంలో 131, 127, 128 బూత్‌ల్లో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వైసీపీ నేతలు డబ్బులు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లి టీడీపీ నేతలు అడ్డుకున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట మండలం నవరలో వైసీపీ సర్పంచ్ టీడీపీ బూత్ ఏజెంట్‌పై దాడి చేయడం కలకలం రేపింది. ఛాలెంజ్ ఓటు వేయించేందుకు ఓటర్లను తీసుకువెళ్తున్న ఏజెంట్ సీతారంపై వైసీపీ సర్పంచ్ దాడికి పాల్పడ్డాడు. కాకినాడ రూరల్ వలసపాకలలో దొంగ ఓటు వేసేందుకు ఓ మాజీ వాలంటీర్ అంతకుముందు వేలిపై ఉన్నసిరాను చెరిపేసుకున్నాడు. గుర్తించి ఇతడిని టీడీపీ, జనసేన నేతలు పట్టుకున్నారు. ప్రత్తిపాడు మండలం రాచపల్లి బూత్‌వద్ద ఇరువర్గాల ఘర్షణ చోటుచేసుకుంది. అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం గొల్లలమామిడాడలో 196, 197, 198 బూత్‌ల్లో వైసీపీ రుబాబుకు దిగింది. నేరుగా బూత్ లోపలకు వెళ్లి వైసీపీకి ఓటువేయాలంటూ ప్రచారం చేసింది. పంచాయతీ కార్యదర్శి బీఎల్‌వో ముసుగులో ప్రచారం చేస్తుండగా అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు మండల పరిషత్ స్కూల్ వద్ద వైసీపీ జనసేన వర్గాల మధ్య వాగ్వివాదం జరిగి ఒకరినొకరు నెట్టుకున్నారు. కళ్లజోడు గుచ్చుకుని ఒకరికి గాయమైంది. పిఠాపురం మండలం విరవ గ్రామానికి వచ్చిన వైసీపీ అభ్యర్థి వంగాగీతకు చుక్కలు కనిపించాయి. పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఆమెను జనసేన నేతలు అడ్డుకున్నారు. పోలింగ్ కేంద్రానికి రావడం కుదరదని అడ్డగించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వచ్చి వీరిని చెదరగొట్టారు. శంఖవరం మండలం నెల్లిపూడిలో టీడీపీ మండల అధ్యక్షుడు రామారావు ఇంటిపై వైసీపీ నేతలు దాడికి యత్నించారు.



ఓటుహక్కు వినియోగించుకున్న జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ, కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, పెద్దాపురం కూటమి అభ్యర్థి చినరాజప్ప, తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య

రాత్రి 10 గంటలకు పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
జగ్గంపేట	2,29,863	1,75,204	76.22
కాకినాడ సిటీ	2,41,620	1,72,083	71.22
కాకినాడ రూరల్	2,69,330	1,96,659	73.02
పెద్దాపురం	2,15,095	1,58,086	78.13
పిఠాపురం	2,36,409	1,85,832	78.61
ప్రత్తిపాడు	2,17,267	1,60,579	73.91
తుని	2,24,538	1,64,688	83.20
కాకినాడ జిల్లా	16,34,122	12,13,131	74.24

రాత్రి 10 గంటలకు పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
అమలాపురం	2,13,508	1,75,890	82.38
పి గన్నవరం	1,98,602	1,62,474	81.81
కొత్తపేట	2,52,383	2,09,595	83.05
మండపేట	2,20,494	1,85,954	84.34
ముమ్మిడివరం	2,45,296	2,02,617	82.60
రామచంద్రపురం	2,03,207	1,73,707	85.48
రాజోలు	1,97,920	1,54,888	78.26
కోనసీమ జిల్లా	15,31,410	12,65,125	82.61

అర్ధరాత్రి 12 గంటలకు పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
అనపర్తి	2,26,053	1,89,398	83.78
గోపాలపురం	2,42,763	2,06,594	85.10
కొవ్వూరు	1,84,136	1,57,795	85.69
నిడదవోలు	2,13,396	1,71,377	80.31
రాజమండ్రి సిటీ	2,67,484	1,78,456	66.72
రాజమండ్రిరూరల్	2,72,826	1,99,145	72.99
రాజానగరం	2,16,491	1,86,533	86.16
తూర్పుగోదావరి	16,23,149	12,89,298	79.43







జేఎన్‌టీయూకేలో స్ట్రాంగ్‌రూంకు ఈవీఎంలు

- పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన భద్రత

కలెక్టరేట్(కాకినాడ), మే 13: ఎన్నికల పోలింగ్ ముగిసిన పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలు, వీవీప్యాట్లను కాకినాడ జేఎన్‌టీయూకేలో స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చుతున్నారు. పోలింగ్ సోమవారం రాత్రి కూడా కొనసాగినందున జిల్లాలో తుని, కాకినాడ సిటీ నియోజకవర్గాల నుంచి కొన్ని ఈవీఎంలు, వీవీ ప్యాట్లను ఇక్కడ భద్రపర్చారు. ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట, కాకినాడ రూరల్, పిఠాపురం నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు తరలివస్తాయి. వాటిని కాకినాడ జేఎన్‌టీయూలో సివిల్ ఇంజినీరింగ్ పీజీ బ్లాక్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ, మెకానికల్ ఇంజినీరింగ్ పీజీ బ్లాక్, మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం ఫస్ట్ ఫ్లోర్‌లలో భద్రపర్చుతారు. దీనికి పోలీసు, సీఆర్పీఎఫ్ బలగాలతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. జూన్ 4న ఇక్కడే ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

కాకినాడ జేఎన్‌టీయూకు ఈవీఎంలను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

పవన్‌కు ప్రేమతో ఓటేశారు
జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

- 7లో

‘బూత్’పై వైసీపీ ప్రతాపం

- 7లో

పిఠాపురంలో వంగా గీతకు చుక్కెదురు

- 7లో


దుర్గాడలో..


ఐ.పోలవరంలో..


ఆత్రేయపురం మండలం వెలిచేరులో తొలిసారి ఓటు వేసిన యువకులు


రాజమండ్రిలో యువ ఓటరు




రాజమహేంద్రవరంలో ఓటర్ల సందడి


ప్రత్తిపాడు: ధర్మవరంలో కొత్త ఓటర్ల సందడి


తన స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దశరథ రామారెడ్డి, ఆయన భార్య సింధు..


రాజమహేంద్రవరంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

ఓటోత్సాహం

పండగలా పోలింగ్ డే

మన్యంలో పోలీస్ నీడన పోలింగ్

రంపచోడవరం, మే 13: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మన్యం నియోజకవర్గంలో పోలీసు నీడన సోమవారం నాటి సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మధ్యాహ్నం 4 గంటలకే పోలింగ్‌ను ముగించేశారు. ఎక్కడా ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు కానీ, అవాంఛనీయ ఘటనలు కానీ చోటు చేసుకోలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్, రంపచోడవరం అదనపు ఎస్పీ జగదీష్ అడహళ్లి స్పష్టం చేశారు. 11 మండలాలలోని 399 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌కు మునుపెన్నడూ లేనంతగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేశారు. మొత్తం 70 శాతం వరకూ పోలింగ్ నమోదైంది. మారేడుమిల్లి, వై.రామవరం, చింతూరు, ఎటపాక మండలాలలో మావోయిస్టు ప్రభావిత సరిహద్దు ప్రాంతాలను పోలీసులు పూర్తిగా తమ అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యంగా వై.రామవరం మండలంలోని గుర్తేడు, పాతకోట, ఇర్లవాడ గ్రామాల్లో నిర్వహించిన ఆరు పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను, సిబ్బందిని వాయుసేనకు చెందిన హెలికాప్టర్ ద్వారా రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూమ్ పరిశరాలలోని మైదానానికి తరలించారు. మధ్యాహ్నం నాలుగు గంటలకే పోలింగ్ సమయం ముగిసిపోయినప్పటికీ అప్పటికే లైన్లో ఉన్న వారందరికీ సాయంత్రం ఐదు గంటలవరకూ పోలింగ్‌కు అనుమతించారు. తెలుగుదేశం అభ్యర్థి మిరియాల శిరీషాదేవి రాజఒమ్మంగి మండలం అనంతగిరిలోనూ, వైసీపీ అభ్యర్థి నాగులాపల్లి ధనలక్ష్మి అడ్డతీగల మండలం పాపంపేటలోనూ, సీపీఎం అభ్యర్థి లోతా రామారావు రాజఒమ్మంగి మండలంలోనూ ఓటు హక్కు వినియోగించుకున్నారు.


గుర్తేడు పోలింగ్ కేంద్రం వద్ద సాయుధ పోలీసు నిఘా

పల్లంలో కొట్లాట

ముగ్గురికి తీవ్రగాయాలు




కాట్రేనికోన, మే 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పల్లంలో అల్లర్లు చెలరేగాయి. వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన గొడవల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. టీడీపీ వర్గీయుల ఇంటి వద్ద వైసీపీ వర్గీయులు కవ్వింపు చర్యలకు పాల్పడటంతో ఘర్షణ జరిగి ఇరువర్గాలు రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. మల్లాడి చినధర్మారావు, మల్లాడి నరసింహమూర్తి, మల్లాడి సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అమలాపురం డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు రక్షణ ఏర్పాటు చేశారు. బలుసుతిప్పలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య గొడవతో ఉద్రిక్తత నెలకొంది. కుండలేశ్వరంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వివాదం జరిగి తోపులాటకు దారితీసింది. వైసీపీకి చెందిన దివ్యాంగుడు కోలా సత్యనారాయణ ఈ సంఘటనలో గాయపడ్డాడు.

పవన్‌కు ప్రేమతో ఓటేశారు

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న నాగబాబు

పిఠాపురం, మే 13: అభిమానంతో ఓటు వేయడం వేరు, ఇష్టంతో ఓటు వేయడం వేరు ఈ రెండు కలిపి పిఠాపురం నియోజకవర్గ ప్రజలు ప్రేమతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఓటు వేశారని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. ఆయన నియోజకవర్గంలో పోలింగ్‌బూత్‌లను సోమవారం సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. పిఠాపురం ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో పవన్ బాధ్యతను మరింత పెంచారని నాగబాబు చెప్పారు. పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పవన్‌కల్యాణ్ పేరు ప్రకటించిన నాటి నుంచి నేటి వరకూ అలుపెరగని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. జనసేన పార్టీ శ్రేణులతో టీడీపీ, బీజేపీ శ్రేణులు మమేకమైన తీరు మరువలేనిదని చెప్పారు. నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళల శ్రమ వెలకట్టలేదని తెలిపారు. పవన్ పోటీతో పిఠాపురం పార్టీ శ్రేణులపై ఒత్తిడి ఏర్పడిన మాట వాస్తవమని, అయినప్పటికి చిన్న ఇబ్బంది లేకుండా ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడానికి దోహదం చేసిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. మండల, గ్రామ, పట్టణ, వార్డు స్థాయిలో కమిటీలుగా ఏర్పడి పవన్‌కల్యాణ్ అభ్యర్థిత్వాన్ని బలపరిచేందుకు శ్రమించిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తిస్తామని తెలిపారు.

4 చోట్ల ఈవీఎంల మార్పు

ప్రత్తిపాడు, మే 13: ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఈవీఎం మిషన్లలో కాకినాడ ఎంపీ జనసేన కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ఫొటోపై స్టాంప్ పడటంతో అతని బొమ్మ అస్పష్టత ఉండటం వల్ల 14 గ్రామాల నుంచి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావుకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆర్వో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 4 చోట్ల ఈవీఎం మిషన్లలో జనసేన అభ్యర్థిపై స్టాంప్ లేకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే మండలంలోని శరభవరం, ఒమ్మంగి గ్రామాల్లో కూడా టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య స్వల్ప వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 2,17,267 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం నాటికి 68 శాతం పోలింగ్ నమోదయింది.

ఓటు వేసిన అనంతరం..

ఇంటికొచ్చి ఫిట్స్‌తో వ్యక్తి మృతి

మామిడికుదురు, మే 13: ఓటు హక్కు వినియోగించుకున్న వ్యక్తి ఫిట్స్ రావడంతో మృతి చెందాడని బంధువులు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గోగన్నమఠంలో కర్రి సత్యనారాయణ(52) ఓటు హక్కును వినియోగించుకుని ఇంటికి వెళ్లాడు. ఫిట్స్ రావడంతో రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు బంధువులు తెలిపారు.

రేగులపాడులో

కూనవరం, మే 13: మండలంలోని రేగులపాడులో పైదా పార్వతి(41) ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేసి ఇంటికి తిరిగివచ్చిన కొద్దిసేపటికే మృతిచెందింది. మండలంలో భారీగా ఓటు శాతం నమోదైంది.

చున్నీ మెడకు చుట్టుకుని బాలిక మృతి



మోతుగూడెం, మే13: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలో మల్లవరపు పవిత్ర(10) ఉయ్యాల చున్నీ మెడకు చుట్టుకోవడంతో మృతిచెందింది. చిన్నారి తల్లిదండ్రులు వీరభద్రరావు, దేవి దంపతులు ఓటు వేయడానికి వెళ్లారు. ఇంటి గుమ్మానికి చున్నీతో ఉయ్యాలతో పవిత్ర ఆడుకుంటూ ఊగడంతో ఒక్కసారిగా చున్నీ మెడకి చుట్టుకోవడంతో ఊపిరాడక అలాగే ఉండిపోయింది. కొద్దిసేపటి తర్వాత ఓటేసి తల్లిదండ్రులు ఇంటికి వచ్చే చూసేసరికి పవిత్ర మెడకు చున్నీ వేలాడుతూ చూసి తల్లిదండ్రులు ఆటోలో డొంకరాయి ఏపీజెన్కో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె కండిషన్ సీరియస్‌గా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. డొంకరాయి ఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంగా గీతకు చుక్కెదురు


వంగా గీతను అడ్డుకుంటున్న జనసేన కార్యకర్తలు

పిఠాపురం రూరల్, మే 13: పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌కు గ్రామాల్లో చుక్కెదురయింది. పలు చోట్ల గీతను అడ్డుకున్నారు. విరవ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళి పరిశీలించేందుకు సోమవారం మధ్యాహ్నం వెళ్లిన గీతను లోపలకు వెళ్లకూడదంటూ జనసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. నినాదాలతో హోరెత్తించారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లనిచ్చేది లేదంటూ అడ్డుతగిలారు. దీనితో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని ఆమెను లోపలకు పంపారు. కుమారపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన గీతను తమకు డబ్బులు ఇవ్వలేదంటూ ఓటర్లు ప్రశ్నించారు. ఇచ్చామని సర్పంచ్, ఎంపీటీసీలు చెప్పడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. డబ్బులు ఇవ్వకుండా ఇచ్చారని అంటారా అంటూ ఓటర్లు నిలదీశారు. పోలీసులు వచ్చి సర్దుబాటు చేశారు. బి.ప్రత్తిపాడులోనూ గీతకు ఇదే పరిస్థితి ఎదురయింది. పోలింగ్ కేంద్రంలోకి రావద్దంటూ నినాదాలు చేశారు.

డబ్బులిస్తేనే ఓట్లు వేస్తాం

గొల్లప్రోలు రూరల్, మే 13: గొల్లప్రోలు మండలం కొడవలిలో ఓటర్లు వైసీపీ నేతలకు ఝలక్ ఇచ్చారు. కాలనీకి చెందిన ప్రజలను ఓటు వేయడానికి రావాలని ఓటర్లను వైసీపీ నేతలు కోరారు. ఓటర్లు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. అయితే డబ్బులు ఇవ్వకుండా వైసీపీ నేతలు ముఖం చాటేశారు. దీనితో ఓటర్లు తాము ఓటు వేసేది లేదంటూ భీష్మించారు. వారికి నచ్చచెప్పేందుకు టీడీపీ,జనసేన నేతలు కోరినా ఫలితం లేకపోయింది.

'బూత్'పై వైసీపీ ప్రతాపం

పలు చోట్ల దౌర్జన్యాలు..కూటమి క్యాడర్‌పై దాడులు


గాయపడ్డ జగడం నరేష్

తాళ్లరేవు, మే 13: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగినప్పటికీ కొన్నిచోట్ల వైసీపీ కార్యకర్తలు ఓటమి భయంతో టీడీపీ,జనసేన, బీజేపీ ఉమ్మడి కార్యకర్తలపై దాడులు నిర్వహించారు. కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెంలో పోలింగ్ బూత్ కేంద్రాలు వద్ద వైసీపీ, కూటమి కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. పాతకోరింగలో వైసీపీ కార్యకర్తలు, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పోలేకుర్రు పంచాయతీ తోటపేట పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ కార్యకర్తలు టీడీపీ బీసీ ఓటర్లను అడ్డుకొని దౌర్జన్యం దాడులు చేయడంతో ఇరువురు మధ్య ఘర్షణ జరిగింది. జగడం నరేష్‌కు తీవ్రగాయం కాగా భత్రాజు యేసు, మహాలక్ష్మీరావు, కడలి గోపి, రెడ్డి సత్యనారాయణ గాయపడ్డారు. సంఘటన స్థలానికి కోరింగ ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో చేరుకుని గ్రూపులను చెదరగొట్టి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి గాయాలు



ఆత్రేయపురం, మే 13: సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కోలేని వైసీపీ శ్రేణులు టీడీపీ మండల అధ్యక్షుడిపై దాడికి పాల్పడ్డారు. సోమవారం ఆత్రేయపురం పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ నాయకులు వెళ్లడంతో అడ్డువచ్చిన టీడీపీ మండలాధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజుపై వైసీపీ మూకలు దాడికి పాల్పడ్డాయి. చొక్కాను చించి భుజంపై గాయపరిచారు. ఆత్రేయపురంలో టీడీపీకి మంచి మెజార్టీ వస్తుందని దానిని చూసి ఓర్వలేకే తనపై దాడికి పాల్పడ్డాడని వెంకట్రాజు ఆరోపించారు. తనపై ఉద్దేశపూర్వకంగానే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడికి పాల్పడేలా చేశారన్నారు. ఆత్రేయపురం మండలంలో మంచి మెజార్టీ సాధించడం తథ్యమని కూటమి అభ్యర్థి బండారు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. వెంకట్రాజును ఇంటి వద్ద కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పరామర్శించి సంఘటనల వివరాలు తెలుసుకున్నారు. వైసీపీ దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు.

దొమ్మేరులో ఘర్షణ

కొవ్వూరు, మే 13: కొవ్వూరు మండలం దొమ్మేరులో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. దొమ్మేరు జడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద టీడీపీ, వైసీపీ నాయకులు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకుని ఘర్షణకు దిగారు. సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు పార్టీల కార్యకర్తలను అక్కడ నుంచి పంపించివేశారు. అదే సమయంలో వచ్చిన పోలీసు ఎన్నికల అబ్జర్వర్ బలరాం మీనా వివరాలు సేకరించారు. పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైసీపీ నాయకుల దాడిలో విరిగిన కాలు

రంగంపేట, మే 13 : మండలంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ బూత్‌ల దగ్గర బారులుతీరారు. కొన్ని పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రంగంపేట మండలం సుభద్రంపేటలో పోలింగ్ బూత్ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గుద్దటి సూరిబాబుపై వైసీపీ నాయకులు దాడి చేయడంతో కాలు విరిగింది. పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం సూరిబాబును అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. మండలంలో వడిశలేరు, బాలవరం, మరికొన్ని గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది.

టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ రాళ్ల దాడి



అనపర్తి, మే 13: పెదపూడి మండలం గొల్లల మామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలో పోలింగ్ బూత్ వద్ద సచివాలయ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పోలింగ్ బూత్ వద్ద ఫ్యాన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తుండటంతో టీడీపీ కార్యకర్తలు కార్యదర్శిని నిలదీశారు. ఎటువంటి పోలింగ్ పాసులు లేకుండా పోలింగ్ స్టేషన్‌లో ఉండటంపై కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా బలభద్రపురంలో ఆశవర్కర్ వైసీపీకి ప్రచారం నిర్వహిస్తుండటంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. రంగాపురంలో ముగ్గురు అన్నదమ్ములపై వైసీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఇరువురు సోదరులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు.

వైసీపీ ఎంపీపీ హల్‌చల్

బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామంలో పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్ సరళి పరిశీలించేందుకు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడికి చేరుకున్నారు. ఆయనతో పాటుగా నలుగురు వ్యక్తులు ఉండటంతో ఎంపీపీ జ్యోతిర్మయి పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో టీడీపీ శ్రేణులు ముందుకు రావడంతో కొద్ది సేపు రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. చివరకు పోలీసులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. రాళ్ల దాడిలో గాయపడిన కార్యకర్తలను ఆస్పత్రిలో నల్లమిల్లి పరామర్శించారు.

ముగిసిన పోలింగ్!

- గంటలకొద్దీ క్యూలలో నిలబడి ఓటుహక్కును వినియోగించుకున్న ప్రజలు
- భారీగా తరలివచ్చిన యువత, మహిళలు
- పలుచోట్ల రాత్రి వరకూ కొనసాగిన పోలింగ్
- సరైన ఏర్పాట్లు లేక ఇబ్బందులు పడిన ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఉన్నతాధికారులు, నాయకులు


పిఠాపురం తారకరామనగర్ పోలింగ్ కేంద్రానికి చంటిబిడ్డతో వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్న మహిళ


గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు, పెద్దాపురంలో ఓటు వేసేందుకు క్యూ కట్టిన ప్రజలు


పిఠాపురంలో తొలిసారి ఓటు వేసిన యువత, కొత్తపల్లిలో బారులుతీరిన ఓటర్లు, జగ్గంపేట: రాజపూడిలో ఓటర్లు, సామర్లకోటలో ఓటేసేందుకు వచ్చిన వృద్ధురాలు

పిఠాపురం/పిఠాపురంరూరల్/గొల్లప్రోలు/గొల్లప్రోలు రూరల్, మే 13: జిల్లాలో సోమవారం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసింది. మండుటెండలోనూ ఉత్సాహంగా ఓటు వేసేందుకు ఓటర్లు తరలివచ్చారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల పరిధిలోని గ్రామాలు, పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల పరిధిలో ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 6గంటలు దాటిన తర్వాత క్యూలో ఓటర్లు భారీగా ఉన్నారు. విరవ, విరవాడ, దుర్గాడ, చేబ్రోలు,తాటిపర్తి, చిత్రాడ సహా పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లోనూ 6గంటల వరకూ క్యూలో ఉన్న ఓటర్లందరికి ఓటు వేసే అవకాశం కల్పించారు. గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలల వద్ద మండుటెండల్లో ఓటర్లు బారులు తీరారు. దీంతో పలువురు ఓటర్లు అవస్థలు పడ్డారు. నిలబడలేక నీడ లేక అలానే నిలుచుండి పోయారు. పిఠాపురం పట్టణం, మండలంలోని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గొల్లప్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు వచ్చిన పద్మ అనే గర్భిణి ఎండవేడి తాళలేక అస్వస్థతకు గురైంది. ఆమెకు వైద్య సిబ్బంది సపర్యలు చేశారు. అనంతరం చికిత్స చేసి ఇంటికి పంపించారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7గంటలకే యువతీ యువకులు క్యూలో ఓటు వేసేందుకు నిలుచున్నారు. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఉంటున్న దేవరపల్లి సీతామహాలక్ష్మి పిఠాపురంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు వచ్చారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో సాయంత్రం 6గంటల తర్వాత యువతీ యువకులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. పిఠాపురం నియోజకవర్గంలో చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం 6గంటల సమయానికి 75.30శాతం పోలింగ్ నమోదయింది. మొత్తం 2,36,409 ఓట్లుకు గానూ 1,78,016 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పిఠాపురంతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో పలు గ్రామాల్లో రాత్రి 10 గంటలకు పోలింగ్ జరిగింది. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పిఠాపురంలోని కుమ్మరివీధి సచివాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కాకినాడసిటీ/కార్పొరేషన్/పోర్టుసిటీ(కాకినాడ): కాకినాడ సిటీ నియోజకవర్గం ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఉదయం 7గంటల సమయం కంటే ముందుగానే దుమ్ములపేట, సంజయ్‌నగర్, డెయిరీఫారమ్ ఏఎంజీ స్కూల్, అన్నమ్మఘాటీ, ఎన్టీఆర్‌నగర్ స్కూల్ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూ కట్టారు. పోలింగ్ గడువు ముగిసే సాయంత్రం 6గంటల సమయానికి దుమ్ములపేట, పర్లోవపేట ఏఎంజీ స్కూల్, సంజయ్ నగర్, ఏటిమొగ ప్రాంతాల్లో ఓటర్లు ఉండిపోవడంతో వారికి ఓటువేసే అవకాశం కల్పించారు. సంజయ్‌నగర్ స్కూల్, విముక్తి స్కూల్ పోలింగ్ కేంద్రాల్లోని బూత్‌ల్లో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కొన్ని ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. టీడీపీ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నమ్మఘాటీ, ఎంఎస్ఎన్ చార్టీస్, సంజయ్‌నగర్, సినిమారోడ్ సీబీఎం స్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. దుమ్ములపేటలో పోలింగ్ ముగిసే సాయంత్రం 6 గంటల సమయానికి పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రం బయట ఉండిపోయారు. వనమాడి కొండబాబు అక్కడకు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఓట్ల స్లిప్పులకోసం జరిగిన తొక్కిసలాటలో ఓ వృద్ధురాలు సొమ్మసిల్లి పడిపోగా ఆస్పత్రికి తరలించారు. ఈ కేంద్రంలో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. అలాగే కాకినాడ సిటీ నియోజకవర్గం కోర్టు ప్రాంగణం సైనిక్‌భవన్‌లో గల 118 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికల సిబ్బంది నిర్లక్ష్యంతో పోలింగ్ నెమ్మదించింది. పోలింగ్ పూర్తయిన తర్వాత కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్‌ల నుంచి ఈవీఎం, వీవీప్యాట్లతోపాటు ఇతర ఎన్నికల సామాగ్రిని జేఎన్టీయూకేలో రిసెప్షన్ కేంద్రానికి తరలించే ప్రక్రియ ప్రారంభమవగా అక్కడి సిబ్బందికి ఆర్వో వెంకటరావు సూచనలు ఇచ్చారు.

సామర్లకోట: పెద్దాపురం డీఎస్పీ కెలతాకుమారి సామర్లకోట,పెద్దాపురం పట్టణాల్లో, మండలాల్లో పర్యటించి పోలింగ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేశారు. జిల్లా విద్యుత్ ఉన్నతాధికారి, తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ టీఎస్ఎన్.మూర్తి తన స్వగ్రామమైన సామర్లకోట మండలం పి.వేమవరంలో ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. పెద్దాపురం టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప కుటుంబసమేతంగా సామర్లకోట మండలం అచ్చంపేటలోని తమ ఇంటి నుంచి గ్రామంలో పోలింగ్ బూత్‌కు చేరుకుని ఓటుహక్కు వినియోగిం చుకున్నారు. చినరాజప్ప, భార్య అనూరాధ, కుమార్తె బండారు కళ్యాణి, మనుమడు బండారు సుజహాన్, కోడలు డాక్టర్ సుజనలు అచ్చంపేటలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా గ్రామంలో పోలింగ్ సరళిని చినరాజప్ప పలువురి నుంచి సమాచారం సేకరించారు. అలాగే సామర్లకోట పట్టణ పరిధిలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 4 బూత్‌లలో పోలింగ్ ప్రక్రియను రాజప్ప పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులు సూచనలిచ్చారు. కూటమి నాయకులతో పోలింగ్ ప్రక్రియపై సమీక్షించారు.

పెద్దాపురం: పెద్దాపురం నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణ, గ్రామాల్లో ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల సమయంలో కొద్దిగా పోలింగ్ మందంకొడిగా సాగింది. పెద్దాపురం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చినరాజప్ప పరిశీలించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు తాటిపర్తి గ్రామంలో, పెద్దాపురం మండలం పులిమేరులో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు ఓటుహక్కు వినియోగించుకున్నారు. పట్టణ పరిధిలో రాత్రి వరకూ పోలింగ్ కొనసాగగా ఆర్వో సీతారామారావు పర్యవేక్షించారు.

కరప: కరప మండల వ్యాప్తంగా 66 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఓటర్లు రావడంతో బూత్‌లు కిక్కిరిసిపోయాయి. ఎన్నికల అధికారులు తగ్గ ఏర్పాట్లు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారు. పెనుగుదురులో మహిళలు, పురుషులను ఒకే క్యూలైన్‌లో పెట్టి బూత్‌కు పంపించడం వివాదాస్పదమయ్యింది. అధికారులకు ఫిర్యాదు చేయడంతో వేర్వేరు లైన్‌లు ఏర్పాటుచేశారు. అరట్లకట్ట 201, నడకుదురు 212, సిరిపురం 256 పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎమ్‌లు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. వేములవాడ పోలింగ్ కేంద్రానికి కూటమి అభ్యర్థి పంతం నానాజీ వచ్చి బూత్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయగా వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తల నడుమ తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగింది. పెదకొత్తూరులో వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు పోలింగ్ బూత్‌కు వెళుతుండగా స్థానిక జనసైనికులు రెచ్చగొట్టేలా ప్రవర్తించడం వివాదాస్పదమయ్యింది. కరప హైస్కూల్ బూత్‌లో సహాయకుడి విధుల్లో ఉన్న ఒక ఉపాధికూలీ వైసీపీకి ఓటేయాలని ఓటర్లను ప్రభావితం చేయడంపై జనసైనికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సెక్టార్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్‌లకు ఫిర్యాదు చేయడంతో అతడిని విధుల నుంచి తప్పించారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్ మండలంలో పలు గ్రామాల్లో ఒకే పోలింగ్ బూత్‌లో 1400కి పైగా ఓట్లు కేటాయించడం, సర్వర్ లోపంతో పోలింగ్‌లో జాప్యం జరిగింది. సూర్యారావుపేట, సర్పవరం శివారు భావనారాయణపురం, వాకలపూడి, బొందగుంట, కొత్తూరు తదితర పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు పోలింగ్ జరిగింది. సూర్యారావుపేటలో వైసీపీ, జనసేన,టీడీపీ కార్యకర్తలకు మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు చెదరగొట్టి పలువురు యువకుల్ని అదుపులోకి తీసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. పలు గ్రామాల్లో వైసీపీ నాయకులు వలంటీర్ల ద్వారా వృద్ధులకు తోడుగా వెళ్లి ఓట్లేయించుకునే ప్రయత్నాలకు తెరతీయడం వాగ్వాదానికి దారితీసింది. జనసేన, టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వలంటీర్లు వెళ్లిపోయారు. వాకలపూడి, వలసపాకల, సూర్యారావుపేట గ్రామాల్లో పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ తీరు, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జనసేన కూటమి అభ్యర్థి పంతం నానాజీ అర్బన్ డివిజన్‌లో కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులు వాకలపూడిలో ఓటు వేశారు.

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభంకాగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు కొంత సమయం మొరాయించడంతో కొన్ని పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ మందకొడిగా సాగడంతో ఓటర్లు ఇబ్బందిపడ్డారు. గంగనాపల్లిలో పింక్ బూత్‌వద్ద మహిళా ఓటర్లు ఓట్లువేసేందుకు రాత్రి 9దాటినా క్యూలైన్‌లో వేచిఉన్నారు. చీడిగలో ఓ పోలింగ్‌బూత్‌లో ఓటింగ్ రాత్రి 8గంటలకు పూర్తయ్యింది. అయితే రూరల్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి పంతం నానాజీ గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్‌బూత్‌ల సమస్యలపై ఆర్వోకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. పోలింగ్ కేంద్రాలవద్ద కనీస సౌకర్యాలు కల్పించలేదని తెలిపారు.

ఏలేశ్వరం: ఏలేశ్వరం పట్టణం, మండలం గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ సాయంత్రం 6గంటల వరకు జరిగింది. మొత్తం 63 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు మండలంలోని లింగంపర్తిలో వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు, యర్రవరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీరుకొండ సత్యనారాయణ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ, వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు పట్టణ, రూరల్‌లో పలు పోలింగ్ స్టేషన్‌లకు వచ్చి ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. ఏలేశ్వరంలోని 20వ పోలింగ్ స్టేషన్‌లో సాయంత్రం 4గంటల నుంచి సుమారు 2 గంటల పాటు ఈవీఎం పనిచెయ్యలేదు. మండలంలోని జె.అన్నవరంలోని 6వ నెంబర్ పోలింగ్ స్టేషన్‌లో ఉదయం 7 నుంచి 40నిమిషాల పాటు ఈవీఎం మెరాయించింది. టెక్నికల్ సిబ్బంది వచ్చి సరిచేయడంతో ఓటింగ్ ప్రారంభమైంది. ఏలేశ్వరంలోని లింగవరం కాలనీలో 17, 18, 19, 20 పోలింగ్ స్టేషన్‌లలో సాయంత్రం 6గంటలు దాటినా భారీ సంఖ్యలో ఓటర్లు క్యూలో ఉన్నారు.

గండేపల్లి: మండలంలో చిన్నచిన్న ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించగా ఓటర్లు క్యూలైన్లలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మల్లేపల్లి, నీలాద్రిరావుపేట, పలు చోట్ల చిన్నచిన్న ఘర్షణలు జరిగినప్పటికీ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ రామకృష్ణ, కేంద్ర, స్థానిక పోలీసు బలగాలతో గస్తీ ఏర్పాటు చేశారు. మల్లేపల్లి, గండేపల్లి పోలింగ్ కేంద్రాలను జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ.. నీలాద్రిరావుపేట, మల్లేపల్లిలో కేంద్రాలను జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ సందర్శించారు.

జగ్గంపేట: జగ్గంపేటలో 248బూత్‌లలో చెదురు ముదురు ఘటనలు తప్ప సజావుగా పోలింగ్ సాగింది. జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ తన స్వగ్రామమైన ఇర్రిపాకలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, కాంగ్రెస్ అభ్యర్థి మరోతి శివగణేష్ ఓటుహక్కు వినియోగించుకున్నారు. జ్యోతుల నెహ్రూ ఇర్రిపాక, రామవరం, జగ్గంపేట, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ జగ్గంపేట తదితర గ్రామాల్లోని బూత్‌లను సందర్శించారు. నియోజకవర్గంలో 2,29,863మందికి 1,63,157మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిశాక జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ముఖ్య నాయకులతో సమావేశమై పోలింగ్ సరళిని విశ్లేషించి పోలింగ్ శాతం ఎంత మేరకు అయిందో అడిగి తెలుసుకున్నారు.

తుని రూరల్: తుని నియోజకవర్గంలో 223 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పోటెత్తారు. పలు పోలింగ్‌స్టేషన్ల వద్ద ఓటర్లు మండుటెండలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల వీవీప్యాడ్‌లు, ఈవీఎంలు మెరాయించడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 తరువాత భారీ వర్షం కురిసి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడి ఎక్కడికక్కడే పోలింగ్ నిలిచిపోయింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో నిర్లక్ష్యం వహించడంతో కొన్నిచోట్ల అధికారులపై ఓటర్లు వాగ్వివాదానికి దిగారు. ఏవీ నగరంలో శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, కూటమి తుని అభ్యర్థి యనమల దివ్య ఓటు హక్కు వినియోగించుకున్నారు. తుని పట్టణ, రూరల్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఎస్.గణేష్ పరిశీలించారు. కేవో.మల్లవరం, దొండవాకలో సమస్యలు గుర్తించి ఎన్నికల అధికారులతో పరిష్కరింపజేశారు.

రౌతులపూడి: మండలంలోని పోలింగ్ ప్రశాతంగా జరిగింది. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. గిడజాంలో మాక్ పోలింగ్ నిర్వహించిన తరువాత గంటసేపు ఈవీఎమ్‌లు పని చేయకపోవడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. రౌతులపూడి, మూలగపూడి, ఎస్.అగ్రహారం గ్రామంలో పోలింగ్ సమయం ముగిసిన తరువాత కూడా ఓటర్లు బారులు తీరారు. బంగారయ్యపేట, ఎ.మల్లవరంలో స్వల్ప ఘర్షణలు జరిగాయి. వృద్ధులను, దివ్యాంగులను యువకులు పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చారు.

కొత్తపల్లి: మండలంలో ఉదయం 7గంటల నుంచే పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం మండలంలో పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌కు అంత రాయం ఏర్పడింది. పలు కేంద్రాల్లో వృద్ధులు ఈవీఎంలలో రెడ్ బటన్ నొక్కడం వంటి సంఘటనలు జరగడం, మళ్లీ వాటిని సరిచేయడం వంటి సంఘటనలతో కూడా పోలింగ్ నిర్వాహణలో ఆలస్యం జరిగింది. సాయంత్రం 6.45 నిమిషాల వరకు కొత్తపల్లి మండలంలో వివిధ పోలింగ్ కేంద్రాల్లో సుమారు 70శాతం పోలింగ్ పూర్తయ్యింది. సాయంత్రం 6 గంటలోపు వచ్చిన ఓటర్లను కేంద్రాల లోపలకు పంపి గేట్లకు తాళాలు వేశారు.

కోటనందూరు: మండలంలో సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురవడంతో కరెంటలేక ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పాతకొట్టాంలో పోలింగ్‌కేంద్రంలో కరెంటు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని అల్లిపూడి, కెమల్లవరం,కోటనందూరు, కెఇచిన్నయ్యపాలెం, పాతకొట్టాంలో ఇదే పరిస్థితి ఉంది. మండలంలో పోలింగ్ కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఓటర్లు మండుటెండుల్లో నిలుచుని ఓట్లు వేశారు. మంచినీటి సదుపాయం సరిగ్గా కల్పించలేదు.

కిర్లంపూడి: మండలంలో ఓటర్లు ఉదయం 7గంటల నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కిర్లంపూడిలోని పోలింగ్ కేంద్రాలు పరిశీలించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుటుంబీకులు, జడ్పీ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ముద్రగడ ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో పదేళ్ల మనమరాలుతో పోలింగ్ బూత్‌లోకి వెళ్లడం నియమావళికి విరుద్ధమని స్థానికులు విమర్శించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7గంటలకే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు తరలివచ్చారు. సాయంత్రం 5గంటలకు పోలింగ్ 65.05శాతం నమోదై 1,41,332 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే నియోజకవర్గంలో 6గంటలకు పోలింగ్ సమయం ముగిసినప్పటికీ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల రద్దీ కొనసాగింది. నియోజకవర్గంలో పోలింగ్ 73.91శాతంగా నమోదైంది. జెల్దాం, రాఘవపట్నం, ఈ.జగన్నాధపురం, బురదకోట గిరిజన గ్రామాల్లో పోలింగ్ రాత్రి 11గంటల వరకు కొనసాగింది. నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను కాకినాడ జేఎన్టీయూ లైబ్రరీ బ్లాక్‌లో భద్రపరిచేందుకు ఎన్నికఅధికారులు తరలించారు.

తాళ్లరేవు: మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 75 పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. పటవల ఈబీసీ కాలనీలో ఎంపీపీ రాయుడు సునీత ఓటుహక్కు వినియోగించుకున్నారు. అలాగే తాళ్లరేవు మండలంలో పోలింగ్ బూత్‌లను ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పరిశీలించారు.

అన్నవరం: అన్నవరంలో ఉదయం అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్‌బూత్‌ల వద్ద జనం అధికంగా ఉండడంతో పలువురు వెనుతిరిగి సాయంత్రం వచ్చి ఓటేశారు. అన్నవరంలో మొత్తం 10552 ఓటర్లు ఉండగా 7160 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.


కాకినాడ రూరల్: చీడిగలో రాత్రి 8 గంటలు దాటినా ఓటు వేసేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు



సర్పవరం జంక్షన్: వలసపాకల పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్


గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద మండుటెండలో ఓటర్ల పడిగాపులు

మా ఓట్లు ఎందుకు తొలగించారు

అధికారులను నిలదీసిన యువత

పిఠాపురం రూరల్, మే 13: తాము టీడీపీ, జనసేనకు ఓటు వేస్తామనే ఓట్లు తొలగించారని యువతీ, యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం మండలం విరవ గ్రామంలో జనసేన, టీడీపీకి చెందిన సానుభూతిపరుల ఓట్లను తొలగించారు. తమ ఓట్లు ఎందుకు తొలగించారో చెప్పాలంటూ విరవ పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన తహశీల్దారు లక్ష్మిని యువతీ, యువకులు ప్రశ్నించారు. 200మందికి పైగా ఓట్లను ఏకపక్షంగా తొలగించారని ఆరోపించారు. ఇప్పుడు కేంద్రాల వద్దకు ఓటు వేద్దామని వస్తే ఓట్లు లేవని చెబుతున్నారని వారు తెలిపారు. తమ ఓట్లు ఎందుకు తొలగించారో చెప్పాలంటూ అధికారులను నిలదీశారు.


పిఠాపురం మండలం విరవలో ఓట్లు తొలగించారంటూ ఆందోళన చేస్తున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు

పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యలను తెలుసుకున్న టీడీపీ నేతలు


జిల్లా టీడీపీ కార్యాలయంలో వార్ రూమ్ నుంచి సమస్యలు తెలుసుకుంటున్న సానా సతీష్, చిక్కాల

కాకినాడ సిటీ, మే 13: కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్ నుంచి కాకినాడ పార్లమెంట్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద తలెత్తిన సమస్యలను పార్టీశ్రేణుల ద్వారా టీడీపీ నేతలు తెలుసుకుని పోలీస్ పరిశీలకుల దృష్టికి తెచ్చారు. ఈ మేరకు మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ సానా సతీష్, కాకినాడ జిల్లా టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ తోట నవీన్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా వార్ రూమ్‌లో పోలింగ్ ముగిసేవరకు ఉండి సమస్యలను తెలుసుకుని వాటిని పోలీస్ పరిశీలకులైన ఐపీఎస్ అధికారి ఎం.సజీవ్‌పటేల్, ఐఏఎస్ అధికారి ఎస్.గణేష్, రాజేష్ జోగిపాల్‌ల దృష్టికి తెచ్చారు.

వలల షెడ్‌లో అగ్నిప్రమాదం

ఉప్పాడ (కొత్తపల్లి), మే 13: వలల షెడ్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో వలలు కాలిబూడిదైన సంఘటన ఉప్పాడలో జరిగింది.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నాయకర్ కాలనీ ఎదురుగా సముద్రం ఒడ్డున మత్స్యకారుల యువకులు నిర్మించిన షెడ్‌లో దోని అప్పారావు వలలు మరమ్మతులు చేసుకోనేందుకు అద్దెకు తీసుకుని వలలు తయారు చేస్తారు. సోమవారం మధ్యాహ్నం ఎండ తీవ్రతకు వలలు తయారు చేసేందుకు ఉపయోగించే రిజన్,మేట్ ఒకదానికి ఒకటిరాసుకొని మంటలు వ్యాపించాయి. దీంతో సుమారు రూ.3లక్షలు విలువచేసే వలలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. వలల షెడ్‌లో అగ్నిప్రమాదం జరగడంతో అక్కడే నివాసముంటున్న మత్స్యకార మహిళలు ఆందోళన చెందారు.

కాకినాడలో టీడీపీ, వైసీపీ మధ్య ఘర్షణ

కాకినాడ సిటీ/కార్పొరేషన్/పోర్టుసిటీ(కాకినాడ), మే 13: కాకినాడ రామకృష్ణారావుపేటలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ వివాదంలో కాకినాడ సిటీ వైసీపీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని స్థానికులు అడ్డుకున్నారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో రామకృష్ణారావుపేట మున్సిపల్ స్కూల్ పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన డివిజన్ టీడీపీ పరిశీలకుడిపై వైసీపీ మూకలు దాడితో వివాదం తలెత్తింది. కొండబాబు సోదరుడు కుమారుడు, టీడీపీ శ్రేణులు జగన్నాథపురం నుంచి రామకృష్ణారావుపేట చేరుకున్నారు. వారిపై వైసీపీ మూకలు దాడికి దిగాయి. ఇరువర్గాల మధ్య తోపులాట, ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో వైసీపీ మాజీ కార్పొరేటర్ చెయ్యి మణికట్టు విరగడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. అక్కడకు వచ్చిన ద్వారంపూడి ఇరువర్గాలను వారించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ద్వారంపూడిని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో కారులో ఆయన వెనుదిరిగి వెళ్లిపోయారు. ఆ తర్వాత కూడా రామకృష్ణారావుపేటలో పరిస్థితి సద్దుమణగకపోవడంతో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లాఠీచార్జ్ చేసి ఇరుపార్టీల వారిని చెదరగొట్టారు. సినిమారోడ్ సీబీఎం స్కూల్, ఏటిమొగ, అన్నమ్మఘాటీ ప్రాంతాల్లో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగింది.


పిఠాపురం మండలం విరవాడలో జనసేన, వైసీపీ కార్యకర్తల మధ్య తోపులాట దృశ్యం

కౌన్సిలర్ ఇంటిపై రాళ్ల దాడి

పిఠాపురం, మే 13: పిఠాపురంలో వైసీపీ నేతల ఇళ్లవద్దకు డబ్బులు అందని ఓటర్లు సోమవారం తెల్లవారుజామునుంచి వెళ్లడం ప్రారంభించారు. దీంతో వారు ఇంటివద్ద లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఓటర్లు తమకు డబ్బులు ఇస్తారా లేదా అంటూ పలుచోట్ల నేతలను నిలదీశారు. పట్టణంలోని 24వ వార్డు వైసీపీ కౌన్సిలర్ చెల్లూరి లోవరాజు ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. ఇంటి అద్దాలు పగిలిపోయాయి. డబ్బులు ఇవ్వలేదనే ఆగ్రహంతో ఓటర్లే ఈ విధంగా చేసి ఉంటారని భావిస్తున్నారు.

పలుచోట్ల వివాదాలు, తోపులాటలు

గొల్లప్రోలులోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద టీడీపీ, జనసేన కూటమి, వైసీపీ కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలతో ఉద్రిక్తత ఏర్పడింది. మలిరెడ్డి ఉమాంబ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద జనసేన, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గొల్లప్రోలు జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత జరిగింది. ఉదయం జనసేన ఏజెంట్లు కండువాలు వేసుకుని రావడంతో వైసీపీ ఏజెంట్లు అభ్యంతరం తెలిపారు. తాము కండువాలు తొలగిస్తామని, పోలింగ్ కేంద్రంలోని ఫ్యాన్లు తొలగించాలని జనసేన ఏజెంట్లు పట్టుబట్టారు. తహశీల్దారు ఉదయభాస్కర్ అక్కడకు చేరుకుని సర్దిచెప్పారు. చినజగ్గంపేటలో ఘర్షణకు దిగిన వైసీపీ, జనసేన వర్గాలను ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ చెదరగొట్టారు. పిఠాపురం మండలం విరవాడలో జనసేన, వైసీపీ వర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య వివాదం

ప్రత్తిపాడు, మే 13: ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం వివాదం చోటుచేసుకుని ఘర్షణకు దారి తీసింది. మెయిన్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గాలు ఓట్ల ప్రకారంపై వాగ్వివాదానికి దిగి ఘర్షణ పడ్డారు. దీంతో అక్కడ ఉన్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టడంతో పరిస్థితి సద్దుమణిగింది.

కృష్ణవరంలో ఘర్షణ

కిర్లంపూడి, మే 13: మండలంలోని కృష్ణవరంలో ఫ్యాన్‌కు ఓటేయాలని వైసీపీ కార్యకర్తలు పోలింగ్ బూత్‌ల సమీపంలో ప్రచారం నిర్వహించడంతో టీడీపీ కార్యకర్తలు వారితో వాగ్వివాదానికి దిగగా మాటామాటా పెరిగి ఘర్షణ జరిగింది. ఒకరినొకరు కొట్టుకోవడంతో తోపులాట జరిగి టెంట్లు నేలజారి కుర్చీలు విరిగిపోయాయి. విషయం తెలిసిన పోలీసులు వారిని చెరదగొట్టారు. కొద్దిసేపటికే పోలింగ్ మళ్లీ ప్రారంభమైంది.

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు


పిఠాపురం మండలం పి.దొంతమూరులో ఓటుహక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే వర్మ దంపతులు


పిఠాపురంలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు,ఓటువేసిన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గీత


ఏలేశ్వరం లింగంపర్తిలో ఓటు వేసిన వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు


కరప మండలం సిరిపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్సీ చిక్కాల దంపతులు


తుని మండలం ఎస్.అన్నవరంలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న మంత్రి దాడిశెట్టి రాజా


తునిరూరల్: ఏవీ నగరంలో ఓటు వేసిన మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు